E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 15-07-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




88.18 శాతం ఓటరు జాబితా సమగ్ర సవరణ పూర్తి.. ఓట్లకు భారీగా కోత పడే అవకాశం! » 2లో

# ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

## సీఎం రేవంత్ ఔట్‌చాలెంజ్!

- » నాగార్జునసాగర్‌కు రారా?.. బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్
- » "లక్ష కోట్లు మింగారు!" – బీఆర్ఎస్‌పై రేవంత్ ఘాటు విమర్శ
- » రేషన్ కార్డుల పంపిణీలో రేవంత్ మాటలు దళదళ
- » "గత పాలనలో రేషన్ లేదు – ఇప్పుడు బియ్యం ఉంది!"
- » చర్చకు వేదిక సిద్ధం... వాస్తవాలు చెబుదాం – సీఎం రేవంత్
- » నాగార్జునసాగర్ వెళదామా? సుందిళ్ల పోదామా?
- » బీఆర్ఎస్ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- » రూ.లక్ష కోట్లు మింగి తెలంగాణ ధనాన్ని దోచుకున్నారు
- » పదేళ్లలో రేషన్‌కార్డులు ఇవ్వాలన్న ఆలోచనే చేయలేదు
- » మేం రేషన్ కార్డులిస్తున్నాం.. సన్న బియ్యం కూడా ఇస్తున్నామన్న సీఎం
- » స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపు
- » తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

తరువాయి 2లో



ఈ కబురు: కేసీఆర్ రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలేశ్వరం అయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. '70 ఏళ్ల కిందట కాంగ్రెస్ పాలనలో కట్టిన మూసీ, నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎస్ఆర్ఎస్పీ, జూరాల ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో.. కేసీఆర్ పాలనలో కట్టిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ఎలా ఉన్నాయో నాగార్జునసాగర్ కట్టపై చర్చిద్దామా?.. సుందిళ్ల వద్దకు పోదామా?.. చర్చకు సిద్ధమా?' అని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.

# అన్‌డాకింగ్ విజయవంతం... రేపు భూమిపైకి శుభాంశు!

ఈ కబురు: ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి భూమికి శుభాంశు శుక్లా బృందం బయల్దేరింది. దాదాపు 18 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారతీయ వ్యోమగామి శుక్లా.. ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు తిరుగు ప్రయాణం అయ్యారు. ఇవాళ (సోమవారం) సాయంత్రం 4:30 గంటలకు స్పేస్ స్టేషన్ నుంచి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ అన్ డికింగ్ ప్రక్రియ సక్సెస్ అయ్యింది. రేపు పసిఫిక్ సముద్రలోని కాలిఫోర్నియా తీరంలో స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ మధ్యాహ్నం 3 గంటలకు ల్యాండ్ కానుంది. ఐఎస్ఎస్ నుంచి భూమికి చేరుకోడానికి స్పేస్ క్రాఫ్ట్‌కు దాదాపు 22 గంటల సమయం పడుతుందని నాసా ప్రకటించింది.



తరువాయి 2లో


ఓడినా గర్వంగా ఉంది.. అదే మా కొంపముంచింది: టీమిండియా కెప్టెన్ » 6లో



మస్క్ అన్ని కంపెనీల్లో ఒక్కటే ఏఐ » 4లో



కరీనా సైజ్ జీరో రహస్యం.. అసలు విషయం చెప్పిన డైటీషియన్ » 5లో



'హరి హర వీరమల్లు'.. ప్రీ రిలీజ్ ఈవెంట్, రన్‌టైమ్ వివరాలివీ.. » 5లో



## బీసీ రిజర్వేషన్లపై కసరత్తు పూర్తి దశలో

# త్వరలో జీవో విడుదల!



- స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం పకడ్బందీగా జీవో
- న్యాయ పరమైన చిక్కులు రాకుండా రూపకల్పన చేస్తున్న అధికారులు
- సామాజిక, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ వెనుకబాటుతనం, జనాభాకు తగ్గ ప్రాతినిధ్యంపై జీవోలో వివరణ
- డెడికేటెడ్ కమిషన్ నుంచి మరో నివేదిక కోరిన ప్రభుత్వం?
- ఈ నివేదిక రాగానే వారం రోజుల్లో జీవో విడుదల చేసే చాన్స్!

ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచి తూచి ముందు కెళుతోంది. ఇటీవల మంత్రిమండలి ఆమోదించి పంపిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభిస్తుందన్న అంచనాతో.. తదుపరి ప్రక్రియలో భాగంగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసే దిశలో అడుగులు వేస్తోంది. ఈ జీవో రూపకల్పన కోసం.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 50 శాతానికి మించి ఇవ్వాలంటూ పంచాయతీరాజ్ చట్టం-2018కి చేసిన సవరణ, ఈ మేరకు ఆమోదించిన ఆర్డినెన్స్, నూతన మార్గదర్శకాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సమర్పించే నివేదికలను ఆధారంగా చేసుకోనుంది. ఆర్డినెన్స్‌కు మంత్రివర్గ ఆమోదం అనంతరం కొత్త విధివిధానాలతో మరో నివేదిక ఇవ్వాలని డెడికేటెడ్ కమిషన్‌ను కోరిన ప్రభుత్వం.. ఆ నివేదిక వచ్చిన తర్వాత వారం రోజుల్లోపు న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా జీవో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

తరువాయి 2లో

# తెలంగాణ కొత్త సీజేగా జస్టిస్ ఏకే సింగ్

- » త్రిపుర హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ
- » ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ వినోద్ కుమార్ బదిలీకి కూడా కేంద్రం ఆమోదం
- » పలు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త సీజేలు
- » సుప్రీం కొలీజియం సిఫార్సులను ఆమోదిస్తూ న్యాయశాఖ ప్రకటన

ఈ కబురు, హైదరాబాద్: దేశంలోని పలు హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు నియమితులయ్యారు. ఇందులోభాగంగా తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఎన్నడూ లేనివిధంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి తోనే 6 నెలలుగా తెలంగాణ హైకోర్టు కొనసాగింది. గత సీజే జస్టిస్ అలోక్ అరాధే జనవరిలో బదిలీపై బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా వెళ్లిన విషయం తెలిసిందే. నాటి నుంచి సీజే పోస్టు ఖాళీగానే ఉంది. ఎట్టకేలకు పూర్తిస్థాయి సీజేను నియమించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జస్టిస్ ఏకే సింగ్.. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే, జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్ర రావుని త్రిపుర హైకోర్టు సీజేగా బదిలీ చేశారు. దేశంలో ఐదుగురు న్యాయమూర్తులు సీజేలుగా నియమితులవగా, నలుగురు సీజేలను



ఇతర హైకోర్టులకు బదిలీ చేశారు. ఈ మేరకు మే 26న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ ఏడో సీజేగా...: జస్టిస్ ఏకే సింగ్ 1965, జూలై 7న జన్మించారు. బీఏ ఆనర్స్ తర్వాత ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1990లో పట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2000 వరకు అక్కడ న్యాయవాదిగా పనిచేసి..

తరువాయి 2లో

# జల వివాదం.. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు



» 2లో

ఈ కబురు: ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి భూమికి శుభాంశు శుక్లా బృందం బయల్దేరింది. దాదాపు 18 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారతీయ వ్యోమగామి శుక్లా.. ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు తిరుగు ప్రయాణం అయ్యారు. ఇవాళ (సోమవారం) సాయంత్రం 4:30 గంటలకు స్పేస్ స్టేషన్ నుంచి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ అన్ డికింగ్ ప్రక్రియ సక్సెస్ అయ్యింది. రేపు పసిఫిక్ సముద్రలోని కాలిఫోర్నియా తీరంలో స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ మధ్యాహ్నం 3 గంటలకు ల్యాండ్ కానుంది.




కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే మా లక్ష్యం : డిప్యూటీ సీఎం

» 2లో



నేటి నుంచి భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు..!

తరువాయి 3లో



50 రోజుల్లో యుద్ధం ఆపకపోతే.. వందశాతం సుంకాలు: ట్రంప్ వార్నింగ్

తరువాయి 3లో



కవితకు బీసీల కట్టుబాట్లు, పదజాలం తెలియవు: తీన్మార్ మల్లన్న

తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి

# ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?.. సీఎం రేవంత్ ఓపెన్ చాలెంజ్!



ఈ కబురు: కేసీఆర్ రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లలోనే కూలేశ్వరం అయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. '70 ఏళ్ల కిందట కాంగ్రెస్ పాలనలో కట్టిన మూసీ, నాగార్జున సాగర్, శ్రీశైలం, ఎస్ఆర్ఎస్‌పీ, జూరాల ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో.. కేసీఆర్ పాలనలో కట్టిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ఎలా ఉన్నాయో నాగార్జునసాగర్ కట్టపై చర్చిద్దామా?.. సుందిళ్ల వద్దకు పోదామా?.. చర్చకు సిద్ధమా?' అని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. రూ.లక్ష కోట్లు మింగి తెలంగాణ ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కూలిన కూలేశ్వరం వద్ద మిమ్మల్ని ఉరి తీసినా పాపం లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో సోమవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు పేదలకు స్వయంగా రేషన్‌కార్డులు అందజేశారు. అంతకు ముందు ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభలో ప్రసంగించారు.

**నాడు బెల్టు షాపులు తెరిచారు**

'రేషన్‌కార్డు.. పేదల ఆత్మగౌరవం, గుర్తింపు, ఆహార భద్రత. అలాంటి రేషన్ కార్డులను తమ పదేళ్ల పాలనలో పేదలకు ఇవ్వాలన్న ఆలోచనే బీఆర్ఎస్‌కు లేదు. అప్పుడు రేషన్ షాపులు తెరవలేదు. బెల్ట్ షాపులను మాత్రమే తెరిచింది. ఇప్పుడు మా ప్రభుత్వంలో పేదలకు 5.61 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం. 3.10 కోట్ల మంది పేద ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్నాం. ఈ రోజు రేషన్ షాపుల వద్ద జనాలు నిలబడి సన్న బియ్యం తెచ్చుకుంటున్నారు. పేదలకు సన్న బియ్యం ఇస్తుంటే బీఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు. దీనితో పాటు రైతు రుణమాఫీ, భరోసా, సన్న ధాన్యానికి బోనస్ వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశాం. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చాం. పండించిన ప్రతి గింజను కొని బోనస్ ఇచ్చాం. దాంతో ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచాం. రైతును రాజును చేసింది ఇందిరమ్మ రాజ్యమే. సోనియాగాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులు పండుగ చేసుకుంటున్నారు. గత పదేళ్లలో కొత్త కోడలు వస్తే కార్డులో పేరు నమోదు చేయని పరిస్థితి. ఇప్పుడు 26 లక్షల మంది పేర్లను చేర్చాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

మహిళలు అంబానీతో పోటీపడేలా చేస్తున్నాం..

'మహిళల స్వయం సమృద్ధికి కృషి చేస్తున్నాం. రూ.21 వేల కోట్లు వడ్డీలేని రుణాలు అందించాం. మహిళా సంఘాలు వ్యాపారంలో అంబానీతో పోటీపడేలా చేస్తున్నాం. వెయ్యి బస్సులు కొని మహిళా సంఘాలు ఆర్టీసీకే అద్దెకు ఇచ్చేలా రుణాలు అందిస్తున్నాం. నాడు పెట్రోలు బంకులు రిలయన్స్ అంబానీలే పెట్టేవారు. వారితో పోటీ పడేలా మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి పెట్రోలు బంకులు ఏర్పాటు చేయిస్తున్నాం. మహిళ సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకుంటున్నాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యేలోపు లక్ష ఉద్యోగాలను కల్పిస్తాం. ఇప్పటికే 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచాం. జనగణనలో కులగణన చేసేలా కాంగ్రెస్ మోదీ మెడలు వంచాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం. బీసీలు రాజ్యాధికారం పొందేలా చేస్తాం..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**ప్రభుత్వం ఏం చేసిందో మహిళలు ఆలోచించాలి**

'త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు రాబోతున్నాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి. ఆ ఎన్నికల్లో జిల్లాలో ఒక్క గంజాయి మొక్క మొలవకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలదే. మహిళలు ఇంటికి పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో ఆలోచించండి. మీకు వడ్డీలేని రుణాలు, ఉచిత బస్, సబ్సిడీ గ్యాస్ ఇచ్చాం. ఇవన్నీ ఇంట్లో మీ ఇంటాయనతో చర్చించి కాంగ్రెస్‌కు సహకరించండి. 2034 వరకు మేమే అధికారంలో ఉంటాం. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం..' అని సీఎం అన్నారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు: మంత్రి ఉత్తమ్**

దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించామని, ఇప్పుడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీని చేపట్టామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో రేషన్ కార్డుల ద్వారా దొడ్డు బియ్యం వస్తే అందులో 90 శాతం వృధా అయ్యేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చి సన్న బియ్యం అందజేస్తోందని చెప్పారు. ప్రస్తుతం 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాత రేషన్ కార్డులలో కూడా కొత్తగా కుటుంబ సభ్యులను చేర్చుకునే అవకాశం ఉందన్నారు. దేవాదుల ప్రాజెక్టు-6 ప్యాకేజీ ద్వారా పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్‌తో పాటు తుంగతుర్తి నియోజకవర్గానికి కూడా గోదావరి జలాలు అందుతాయని చెప్పారు. 20 వేల ఎకరాలు అదనంగా సాగవుతాయన్నారు. బునాదిగాని కాల్వను రీడిజైన్ చేయడానికి రూ.200 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.

**కాంగ్రెస్ పేదల ప్రభుత్వం: మహేశ్‌కుమార్‌గౌడ్**

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రజా పాలనలో అమలు చేస్తున్నామని, 5 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్న ఈరోజు శుభ దినమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇది నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమం అని అన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని మహేశ్‌గౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, యశస్విని రెడ్డి, రామచందర్‌నాయక్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

# బీసీ రిజర్వేషన్లపై కసరత్తు పూర్తి దశలో త్వరలో జీవో విడుదల!



ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచి తూచి ముందుకెళుతోంది. ఇటీవల మంత్రిమండలి ఆమోదించి పంపిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభిస్తుందన్న అంచనాతో.. తదుపరి ప్రక్రియలో భాగంగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసే దిశలో అడుగులు వేస్తోంది. ఈ జీవో రూపకల్పన కోసం.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 50 శాతానికి మించి ఇవ్వాలంటూ పంచాయతీరాజ్ చట్టం-2018కి చేసిన సవరణ, ఈ మేరకు ఆమోదించిన ఆర్డినెన్స్, నూతన మార్గదర్శకాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సమర్పించే నివేదికలను ఆధారంగా చేసుకోనుంది. ఆర్డినెన్స్‌కు మంత్రివర్గ ఆమోదం అనంతరం కొత్త విధివిధానాలతో మరో నివేదిక ఇవ్వాలని డెడికేటెడ్ కమిషన్‌ను కోరిన ప్రభుత్వం.. ఆ నివేదిక వచ్చిన తర్వాత వారం రోజుల్లోపు న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా జీవో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

ఆర్డినెన్స్‌ను, కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ.. పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285 (ఏ)కు చేసిన సవరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు ప్రత్యేక పరిస్థితుల్లో 50 శాతానికి మించవచ్చు అని మాత్రమే ఆర్డినెన్సులో ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆర్డినెన్సుతో పాటు డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొంటారని చెబుతున్నాయి. ఈ జీవో మేరకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దఖలు పడతాయని వివరిన్నాయి.

చట్టానికి చేసిన సవరణే ప్రాతిపదికగా జీవో ప్రభుత్వం జీవో విడుదల చేసే జీవో న్యాయ సమీక్షలోనూ నిలబడే విధంగా అవసరమైన అన్ని అంశాలను ప్రస్తావిస్తూ వివరణాత్మకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల పరిమితిని ప్రత్యేక పరిస్థితుల్లో పెంచేందుకు పంచాయతీ రాజ్ చట్టానికి చేసిన సవరణనే ఈ జీవోకు ప్రాతిపదికగా ఉంటుందని అంటున్నారు.

బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ వెనుకబాటు స్థాయి, జనాభాకు తగిన ప్రాతినిధ్యం అనే అంశాల ప్రాతిపదికన చట్టాన్ని సవరించామని, ఈ అంశాలన్నింటినీ కూలంకషంగా పేర్కొంటూ రిజర్వేషన్ల పెంపును సమర్థించే కోణంలో జీవోకు రూపకల్పన చేస్తున్నామని వెల్లడిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ కొత్త సీజేగా జస్టిస్ ఏకే సింగ్



తెలంగాణ ఏడో సీజేగా..: జస్టిస్ ఏకే సింగ్ 1965, జూలై 7న జన్మించారు. బీఏ ఆనర్స్ తర్వాత ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1990లో పట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2000 వరకు అక్కడ న్యాయవాదిగా పనిచేసి.. 2001లో జార్ఖండ్ హైకోర్టుకు మారారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014, జనవరి 16న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2022, డిసెంబర్ నుంచి 2023, ఫిబ్రవరి వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. 2023, ఏప్రిల్ 17న ప్రధాన న్యాయమూర్తి పదోన్నతితో త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ వారంలో తెలంగాణ హైకోర్టు 7వ సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

**కోల్‌కతాకు జస్టిస్ సుజోయ్‌పాల్**

తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కోల్‌కతాకు, జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్‌కు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుకు కూడా కేంద్రం ఆమోదముద్ర వేస్తూ గెజిట్ జారీ చేసింది. ప్రస్తుతం హైకోర్టులో 26 మంది న్యాయమూర్తులున్నారు. ఇద్దరి బదిలీ, ఒకరి రాకతో ఈ సంఖ్య 25కు చేరనుంది. మొత్తం 42 మందికిగాను ఇంకా 17 ఖాళీలుంటాయి.

సుప్రీంకోర్టు సిఫార్సు చేసిన మరో ముగ్గురు న్యాయమూర్తులు జస్టిస్ అభిషేక్ రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలత బదిలీపై ఇక్కడికి రావాల్సి ఉంది. అలాగే న్యాయవాదుల కోటా నుంచి న్యాయమూర్తులుగా సిఫార్సు చేసిన గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ నియామకాలకు కూడా కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది.

# అన్‌డాకింగ్ విజయవంతం...రేపు భూమిపైకి శుభాంశు!



ఈ కబురు: ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి భూమికి శుభాంశు శుక్లా బృందం బయల్దేరింది. దాదాపు 18 రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారతీయ వ్యోమగామి శుక్లా.. ఆయనతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు తిరుగు ప్రయాణం అయ్యారు. ఇవాళ (సోమవారం) సాయంత్రం 4:30 గంటలకు స్పేస్ స్టేషన్ నుంచి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ అన్ డికింగ్ ప్రక్రియ సక్సెస్ అయ్యింది. రేపు పసిఫిక్ సముద్రలోని కాలిఫోర్నియా తీరంలో స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ మధ్యాహ్నం 3 గంటలకు ల్యాండ్ కానుంది. ఐఎస్ఎస్ నుంచి భూమికి చేరుకోడానికి స్పేస్ క్రాఫ్ట్‌కు దాదాపు 22 గంటల సమయం పడుతుందని నాసా ప్రకటించింది.

ఐఎస్ఎస్ నుంచి క్రూ మెంబర్లు వీడ్కోలు సందర్భంగా భావోద్వేగానికి గురయ్యారు. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ కమాండర్ తకుయా ఒనీషి శుభాంశు శుక్లా బృందం సాహసోపేత యాత్రను అభినందించారు. అంతరిక్ష పరిశోధనల్లో వారి కంట్రిబ్యూషన్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, వ్యోమగాముల బృందం భూమిపైకి చేరాక 7 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంటారు. డాక్టర్ల పర్యవేక్షణలో.. భూమికి అలవాటు పడిన తర్వాత బాహ్య ప్రపంచంలోకి అడుగు పెడతారు. కాగా, యాక్సియం4 మిషన్‌లో భాగంగా స్పెస్ ఎక్స్, నాసా ప్రయోగాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌లో భాగంగా శుభాన్షు శుక్లాతోపాటు నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ఐఎస్ఎస్‌లో వారు ఎన్నో ప్రయోగాలు, పరిశోధనలు జరిపారు. భార రహిత స్థితిలో మానవ శరీరంపై ప్రభావం, పోషకాహార వ్యవస్థలు, రోగనిరోధక వ్యవస్థ వంటి అంశాలపై మొత్తం 60 ప్రయోగాలు చేశారు. వీటిలో ఇస్రో తరపున శుభాంశు శుక్లా 7 ముఖ్యమైన ప్రయోగాలు చేశారు. అలాగే నాసా నిర్వహించిన మరో 5 జాయింట్ స్టడీస్‌లోనూ శుక్లా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారత వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు క్రియేట్ చేశారు. మొదటిసారి 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజుల పాటు ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏళ్ల తర్వాత రోదసిలోకి వెళ్లి వస్తున్న రెండో భారతీయుడిగా శుభాంశు రికార్డు సృష్టించారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే మా లక్ష్యం



ఈ కబురు: తెలంగాణలో ఒక్క కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదని, ప్రతి పేద కుటుంబానికి ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో మధిర నియోజకవర్గ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించండి. ప్రతివారం ఇంటి బిల్లులు చెల్లిస్తాం. మీరు ఎంత వేగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే, అంత త్వరగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఇళ్ల నిర్మాణం పండుగలా జరుపుకోవాలి. గృహప్రవేశానికి పిలిస్తే తప్పక వస్తాను," అని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు, ప్రతి మహిళకు ఆర్థిక స్థిరత్వం కల్పించాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉందని ఆయన పేర్కొన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పేదల కష్టాలను స్వయంగా చూశానని, పేదల ఇంటి కలను నెరవేర్చే ప్రభుత్వం ఇదే అని స్పష్టం చేశారు. ప్రతి ఇంటిని రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు ఒకే సంవత్సరం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. మొదటి సంవత్సరంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ. 22,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. మహిళా సంఘాలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్న దిశగా, మొదటి సంవత్సరం 21,600 కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించామన్నారు. ఈ నెల 12 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ ఉత్సవంలా జరుగుతుందని చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా మహిళలకు నెలవారీ ఆదాయం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. మహిళా సంఘాలు ముందుకు వచ్చి భూములు లీజుకు అడిగితే రైతులు ఇవ్వాలని కోరారు. ఇది రైతులకు కూడా అదనపు ఆదాయాన్ని కల్పిస్తుందని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిందని, కానీ గత బీఆర్ఎస్ పాలనలో ఆ పథకాన్ని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆ పథకాన్ని పునఃప్రారంభించి మహిళల ఆర్థిక సాధికారత కోసం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాల్లో 93 లక్షల కుటుంబాలకు సబ్సిడీ బియ్యం పంపిణీ చేస్తున్నామని, రానున్న రోజుల్లో గ్యాస్ సిలిండర్ రూ. 500కే అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి విద్యుత్ వినియోగానికి సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందని, త్వరలోనే ఆ సమాచారాన్ని ప్రజలకు అందిస్తామని చెప్పారు. విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ స్టాండర్డ్ లో ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలలను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు రుణం ఇచ్చి ఆర్టీసీకి బస్సులు లీజుకు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 650 బస్సులు కొనుగోలు చేసి అందించామని, వీటి ద్వారా నెలవారీ స్థిరమైన ఆదాయం మహిళా సంఘాలకు లభిస్తుందని తెలిపారు. మహిళల పక్షాన ఆర్టీసీకి ప్రభుత్వం ఇప్పటికే ఉచిత ప్రయాణాల కోసం 6,632 కోట్లు చెల్లించిందని, రాష్ట్రంలో మహిళల కోసం ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయడం ఒక పెద్ద సహాయంగా మారిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సేర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాస్ నాయక్, రాయల నాగేశ్వరావు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నియోజిక వర్గానికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

# జల వివాదం.. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు



ఈ కబురు, దిల్లీ: జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు.

**రేపు దిల్లీ వెళ్లనున్న ఏపీ సీఎం చంద్రబాబు**

ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు.

**ఎల్లుండి తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ.. పెండింగ్ సమస్యలపై సీఆర్ పాటిల్‌కు మంత్రి ఉత్తమ్ లేఖ**

జల వివాదాలపై చర్చ కోసం ఈ నెల 16న తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు దిల్లీలో భేటీ కానున్నారు. కేంద్ర జల్‌శక్తి మంత్రి నేతృత్వంలో ఈ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో కృష్ణా, గోదావరిలో వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నదీ జలాల సద్వినియోగానికి ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ఆర్థికసాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరనున్నారు.

నదీ జలాలకు సంబంధించి రాష్ట్ర ప్రయోజనాలు పరిరక్షించుకోవాలని సీఎం పేర్కొన్నారు. గతంలో జరిగిన అన్యాయానికి శాశ్వత పరిష్కారాలు సాధించాలని మంత్రి ఉత్తమ్‌కు సీఎం సూచనలు జారీచేశారు. దీంతో మంత్రి ఉత్తమ్ కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. పెండింగ్, సాగునీటి ప్రాజెక్టులపై వెంటనే చొరవ చూపాలని లేఖలో కోరారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

# 88.18 శాతం ఓటరు జాబితా సమగ్ర సవరణ పూర్తి.. ఓట్లకు భారీగా కోత పడే అవకాశం!

ఈ కబురు, పట్నా: బిహార్‌లో ప్రతిపక్షాలు ఊహించినట్లుగానే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత భారీగా ఓటర్ల సంఖ్య తగ్గే అవకాశం కనిపిస్తోంది. బిహార్‌లోని మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లలో.. 6.60 కోట్లకు పైగా పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చే అవకాశమున్నట్లు ఎన్నికల సంఘం సోమవారం వెల్లడించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన విడుదల చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసి.. ఎన్యూమరేషన్ పత్రాలను ఎన్నికల సంఘానికి సమర్పించేందుకు ఇంకా 11 రోజుల సమయం ఉంది. ఇప్పటి వరకు 83.66 శాతం ఓటర్ల వివరాలను సేకరించినట్లు తాజాగా ఈసీ వెల్లడించింది. వీరితోపాటు మొత్తం ఓటర్లలో 1.59 శాతం మంది ఓటర్లు మృతి చెందగా.. 2.2 శాతం మంది రాష్ట్రం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయారు. 0.73 శాతం మందికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లు ఈసీ పేర్కొంది. ఈ జాబితాను కూడా కలుపుకొని మొత్తం 88.18 శాతం మంది ఓటర్ల గణాంకాలు పూర్తయ్యాయని, ఇంకా 11.82 శాతం ఓటర్ల వివరాలు తెలియాల్సి ఉందని ఎన్నికల సంఘం పేర్కొంది. తాత్కాలికంగా రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన వారు.. పేపర్‌లో వచ్చిన ప్రకటనల ఆధారంగా.. నేరుగా గణాంక పత్రాలను ఎన్నికల సంఘానికి సమర్పించి.. ఓటరు జాబితాలో చేరవచ్చని వెల్లడించింది.

# నేటి నుంచి భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు..!



ఈ కబురు: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం భారత్‌అమెరికా మధ్య నేటి నుంచి మరో విడత చర్చలు అమెరికాలోని వాషింగ్టన్‌లో మొదలుకానున్నాయి. ఇప్పటికే భారత వాణిజ్యశాఖ అధికారులతో కూడిన ఓ బృందం అక్కడికి చేరుకొంది. ఇక దీనిలో చీఫ్ నెగోషియేటర్‌గా వ్యవహరిస్తున్న వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ మాత్రం బుధవారం ఈ బృందంతో చేరనున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ కీలక చర్చలు గురువారం ముగియనున్నాయి. వ్యవసాయం, ఆటోమొబైల్ వంటి రంగాల్లో నెలకొన్న చిక్కుముడులను తొలగించడానికి ఇరు దేశాలకు చెందిన బృందాలు తీవ్రంగా యత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా కూడా అదనపు టారిఫ్‌ల అమలును వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆగస్టు 1వ తేదీ వరకు పలు దేశాలకు గడువును పొడిగించింది. భారత్ ఈ చర్చల్లో పూర్తి స్థాయి ద్వైపాకిక్ష వాణిజ్య ఒప్పందం కోసం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు నాటికి దీనిలో తొలివిడత డీల్‌ను కుదుర్చుకోవాలని.. ఆ తర్వాత కూడా చర్చలను కొనసాగించి పూర్తి స్థాయి ఒప్పందానికి రావాలని ప్రయత్నిస్తోంది. భారత్ వ్యవసాయం, పాల ఉత్పత్తుల విషయంలో అమెరికాకు టారిఫ్‌ల్లో రాయితీలు ఇవ్వడానికి ఇష్టపడటంలేదు. అసలు భారత్ ఈ రంగాల్లో ఏ దేశానికి ఎలాంటి రాయితీలు కల్పించలేదు. ఇక మరోవైపు 26 శాతం టారిఫ్‌లను అమెరికా తొలగించాలని కూడా బలంగా కోరుతోంది. ఇక స్టీల్‌పై 50శాతం, ఆటో సెక్టార్‌పై 25శాతం పన్ను తొలగించాలని కోరుతుంది.

# గురుకులాల్లో మరణాలకు బాధ్యులెవరు రేవంత్‌రెడ్డి?



ఈ కబురు: హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలల పాలనలో 93 మంది విద్యార్థులు మృతిచెందారని, గురుకులాల్లో మరణాలకు బాధ్యులెవరో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానమివ్వాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు. ''యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని జ్యోతిబాపులే హాస్టల్‌లో ఐదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే కారణం. కనీస సౌకర్యాలు లేని హాస్టళ్లో ఉండలేక చివరికి ప్రాణాలు తీసుకోవడం గురుకులాల దుస్థితికి అద్దం పడుతోంది. గురుకులాల్లో మరణాలు కొనసాగుతున్న సీఎంకు పట్టింపు లేదు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తక్షణమే వీటిపై దృష్టిపెట్టాలి'' అని కేటీఆర్ పేర్కొన్నారు. మంచినీళ్ల కోసం ఆడబిడ్డలు బిందెలు పట్టుకొని అడుగు బయటపెట్టకూడదని కేసీఆర్ సంకల్పిస్తే.. చివరికి మహిళలు బిందెలతో నీరు తెచ్చి వరి నారు కాపాడుకునే పరిస్థితి వచ్చింది? అని కేటీఆర్ 'ఎక్స్'లో సీఎంను ఉద్దేశించి విమర్శలు చేశారు.

పాలనా వైఫల్యానికి విద్యార్థుల అవస్థలే నిదర్శనం..

''తుప్రాన్‌పేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం మహాత్మా జ్యోతిబాపులే బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థి మృతి, నల్గొండ జిల్లా దేవరకొండ ఎస్టీ బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో 15 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు, మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం బీసీ గురుకులంలో పురుగులన్నం మాకొద్దు అంటూ రోడ్డెక్కిన విద్యార్థులు.. రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యానికి ఇవి నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



## 50 రోజుల్లో యుద్ధం ఆపకపోతే.. వందశాతం సుంకాలు: ట్రంప్




ఈ కబురు: ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యాకు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. 50 రోజుల్లో ఈ యుద్ధం ఆపేయాలని, లేదంటే రష్యాపై తీవ్రంగా సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. '50 రోజుల్లో ఈ యుద్ధంపై డీల్ కుదరకపోతే సెకండరీ టారిఫ్స్ విధిస్తాం. ఈ సుంకాలు పూర్తి వంద శాతం ఉంటాయి. ఇక అదే మా ముందున్న మార్గం' అని ట్రంప్ చెప్పారు. ఈ క్రమంలో ఉక్రెయిన్‌కు ఆయుధాలు కూడా సరఫరా చేస్తామని చెప్పిన ఆయన.. ఈ యుద్ధం విషయంలో పుతిన్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఉక్రెయిన్‌పై ఇటీవలి కాలంలో రష్యా దాడులు తీవ్రతరం చేసిన క్రమంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇకనైనా ఉక్రెయిన్ యుద్ధంలో శాంతి ఒప్పందాన్ని సీరియస్‌గా తీసుకోవాలని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ కూడా అన్నారు. గతవారం కూడా పుతిన్‌పై మండిపడ్డ ట్రంప్.. రష్యా అధ్యక్షుడి తీరుతో తనను ఏమాత్రం సంతోషంగా లేనని చెప్పారు. 'పుతిన్ తీరుతో నేను ఏమాత్రం సంతోషంగా లేను. తను చాలామందిని చంపేస్తున్నాడు' అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# వాణిజ్యంలో అడ్డంకులు ఉండకూడదు: వాంగ్ యీతో జైశంకర్




ఈ కబురు: భారత్‌చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సాధారణంగా మారిన నేపథ్యంలో నియంత్రణ రేఖ (ఎల్ఏసీ) వద్ద ఉద్రిక్తతలు లేకుండా చేయడంపై ఇరుదేశాలు దృష్టిసారించాలని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న ఆయన.. ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీతో సమావేశమయ్యారు. రెండు దేశాల బంధాలు పాజిటివ్‌గా ముందుకు సాగాలన్న ఆయన.. అభిప్రాయ భేదాలు సమస్యలుగా, పోటీ ఘర్షణగా మారకూడదన్నారు. వాణిజ్యంపై నియంత్రణలు, అడ్డంకులు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కీలకమైన ఖనిజాల ఎగుమతులను ఇటీవలే చైనా నిలిపివేసిన నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) కాంక్లేవ్‌లో పాల్గొనేందుకు ఐదేళ్ల తర్వాత చైనాకు జైశంకర్ వెళ్లారు. ఈ సందర్భంగా 2024 అక్టోబర్ 23న ప్రధాని మోదీజిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశాన్ని గుర్తుచేసిన ఆయన.. 'ఇరుదేశాల నేతల సమావేశం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు పాజిటివ్ దిశలో వెళ్తున్నాయి. వాటిని వేగవంతం చేయడం మన బాధ్యత' అని వాంగ్ యీకి చెప్పారు. భారత్‌చైనా మధ్య నిలకడైన, నిర్మాణాత్మక సంబంధాలు ప్రపంచానికే మేలు చేస్తాయన్నారు.

# బ్రీత్ అనలైజర్ ఫలితాల్లో ఆ పైలట్లు పాసయ్యారు: ఎయిరిండియా సీఈవో



ఈ కబురు, ముంబయి: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక బహిర్గతమైన సంగతి తెలిసిందే. దీనిపై ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ స్పందించారు. సంస్థలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''విమానం నిర్వహణకు సంబంధించి తప్పనిసరి పనులన్నీ పూర్తిచేశాం. ఇంధన నాణ్యతలో ఏ లోపం కనిపించలేదు. టేకాఫ్ సమయంలో ఎలాంటి అసాధారణ పరిస్థితులు లేవు. ప్రయాణానికి ముందు చేసే బ్రీత్ అనలైజర్ ఫలితాల్లో ఆ పైలట్లు పాసయ్యారు. వారి ఆరోగ్య పరిస్థితిలో కూడా ఎలాంటి లోపాలు బయటపడలేదు. మరోవైపు అధికారుల సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయి. ఏఏఐబీ ప్రాథమిక నివేదిక విషయంలో ఇప్పుడే తుది నిర్ణయానికి రావొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం'' అని విల్సన్ వెల్లడించారు. గతవారం విడుదలైన మొత్తం 15 పేజీలతో రూపొందించిన ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. ప్రమాదం వెనక ఏ కుట్ర కోణం లేదని, పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని ప్రాథమికంగా బృందం నిర్ధరించింది. ఇంజిన్ ఇంధన కంట్రోల్ స్విచ్ ఆగిపోవడం వల్లే ప్రమాదం జరిగిఉండొచ్చని అంచనా వేసింది. కాగా.. పైలట్ల పాత్రపై నిర్ధరణకు రావడం తొందరపాటే అవుతుందని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) మాజీ అధిపతి అరబిందో హాండా అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు. పౌర విమానయానశాఖ కూడా ఇదే సూచన చేసింది. ఇదిలాఉంటే.. ఎయిరిండియా విమాన ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తులో తాము భాగం కావాలని కోరుకుంటున్నామని, అందుకుగల చట్టపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నామని ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్‌పీఏ) వెల్లడించింది. ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో పైలట్ల తప్పిదముందనే అర్థం గోచరించేలా పక్షపాత వైఖరి కనిపిస్తోందని ఆరోపించిన సంగతి తెలిసిందే. కాగా.. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులు, సిబ్బంది, హాస్టల్‌లో చనిపోయినవారు మా మదిలో ఎన్నటికీ ఉంటారని, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని ఇప్పటికే బోయింగ్ పేర్కొంది. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ జూన్ 12వ తేదీన టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయిన సంగతి తెలిసిందే . అందులో ఒక్కరు మినహా ప్రయాణికులు, సిబ్బంది కలిపి 241 మంది మరణించారు. వారితోపాటు విమానం ఓ ఆసుపత్రి హాస్టల్‌పై కూలిపోవడంతో 29 మంది మృతి చెందారు.



# కవితకు బీసీల కట్టుబాట్లు, పదజాలం తెలియవు: తీన్మార్ మల్లన్న



ఈ కబురు,హైదరాబాద్: శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిశారు. ఆదివారం క్యూ న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారుతనపై హత్యాయత్నం జరిగిందని, దానిపై మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత అనుచరుల విధ్వంసంపై వివరించినట్లు చెప్పారు. కాసేపట్లో డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ''కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశాం. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరాం. నాకు రక్షణ కల్పించాలని మండలి ఛైర్మన్‌ను కోరాను. ఘటనపై విచారణ చేస్తామని మండలి ఛైర్మన్ హామీ ఇచ్చారు. బీసీల కట్టుబాట్లు, పదజాలం ఏమిటో కవితకు తెలియదు. బీసీల రాజకీయాన్ని నిలువరించాలనే ఉద్దేశంతోనే చర్యలకు పాల్పడుతున్నారు'' అని తీన్మార్ మల్లన్న అన్నారు.

# నేరాల రాజధానిగా బిహార్: రాహుల్ గాంధీ

ఈ కబురు,పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు విమర్శలకు పదును పెడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న వరుస హత్య ఘటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'దేశ నేరాల రాజధాని'గా బిహార్ మారిందని విమర్శించారు. నిరుద్యోగ యువత హత్యలు చేస్తూ గూండాలుగా మారుతుంటే.. సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. మరోవైపు భాజపా మంత్రులు కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈసారి ఓటు అనే ఆయుధాన్ని ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాకుండా.. బిహార్‌ను కాపాడేందుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. బిహార్‌లో ఆదివారం దారుణం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టపగలు ఓ లాయర్‌ని దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. అంతకుముందు ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా, భాజపా నేత సురేంద్ర కేవాట్‌లు హత్యకు గురయ్యారు. వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు ప్రముఖ వ్యక్తులు హత్యకు గురవ్వడం రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. సరిగ్గా ఎన్నికలకు ముందు ఇలాంటి వరుస ఘటనలు చోటు చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. మరోవైపు ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా.. అధికారాన్ని నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రానున్న ఐదేళ్లలో కోటి మందికి ఉద్యోగాలు కల్పిస్తామని కీలక ప్రకటన చేశారు.

# నేటి నుంచి భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు..!

ఈ కబురు: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం భారత్‌అమెరికా మధ్య నేటి నుంచి మరో విడత చర్చలు అమెరికాలోని వాషింగ్టన్‌లో మొదలుకానున్నాయి. ఇప్పటికే భారత వాణిజ్యశాఖ అధికారులతో కూడిన ఓ బృందం అక్కడికి చేరుకొంది. ఇక దీనిలో చీఫ్ నెగోషియేటర్‌గా వ్యవహరిస్తున్న వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ మాత్రం బుధవారం ఈ బృందంతో చేరనున్నారు. నాలుగు రోజులపాటు జరగనున్న ఈ కీలక చర్చలు గురువారం ముగియనున్నాయి. వ్యవసాయం, ఆటోమొబైల్ వంటి రంగాల్లో నెలకొన్న చిక్కుముడులను తొలగించడానికి ఇరు దేశాలకు చెందిన బృందాలు తీవ్రంగా యత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా కూడా అదనపు టారిఫ్‌ల అమలును వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆగస్టు 1వ తేదీ వరకు పలు దేశాలకు గడువును పొడిగించింది. భారత్ ఈ చర్చల్లో పూర్తి స్థాయి ద్వైపాకిక్ష వాణిజ్య ఒప్పందం కోసం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు నాటికి దీనిలో తొలివిడత డీల్‌ను కుదుర్చుకోవాలని.. ఆ తర్వాత కూడా చర్చలను కొనసాగించి పూర్తి స్థాయి ఒప్పందానికి రావాలని ప్రయత్నిస్తోంది. భారత్ వ్యవసాయం, పాల ఉత్పత్తుల విషయంలో అమెరికాకు టారిఫ్‌ల్లో రాయితీలు ఇవ్వడానికి ఇష్టపడటంలేదు. అసలు భారత్ ఈ రంగాల్లో ఏ దేశానికి ఎలాంటి రాయితీలు కల్పించలేదు. ఇక మరోవైపు 26 శాతం టారిఫ్‌లను అమెరికా తొలగించాలని కూడా బలంగా కోరుతోంది. ఇక స్టీల్‌పై 50శాతం, ఆటో సెక్టార్‌పై 25శాతం పన్ను తొలగించాలని కోరుతుంది






## వివో నుంచి కాంపాక్ట్ ఫోన్..
## 6,500 mAh బ్యాటరీతో X200 FE

**దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో కాంపాక్ట్ ఫోన్ల ట్రెండ్ మొదలైంది. ఇటీవల వన్‌ప్లస్ సంస్థ 13 ఎస్‌ను తీసుకురాగా.. తాజాగా వివో X200 FE స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. పేరుకే చిన్న ఫోన్ అయినా దీంట్లో 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ అమర్చడం విశేషం. కెమెరా ప్రియులను టార్గెట్ చేస్తూ ఈ ఫోన్ తీసుకొచ్చారు. మరి ఈ స్మార్ట్‌ఫోన్ ధర ఎంత? విక్రయాలు ఎప్పటి నుంచి?**




వివో ఎక్స్ 200 ఎఫ్‌ఈ 6.31 అంగుళాల 1.5K అమోలెడ్ డిస్‌ప్లే ఉంది. 120Hz రిఫ్రెష్ రేటుతో వస్తోంది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 9,300+ ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది.

వివో ఎక్స్ 200 ఎఫ్‌ఈలో 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 921 సెన్సర్‌తో కూడిన ప్రధాన కెమెరా ఇచ్చారు. 50 ఎంపీ పెరిస్కోపిక్ లెన్స్ ఇచ్చారు. 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ముందువైపు కూడా 50 ఎంపీ కెమెరా ఉంది. జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో తీసుకొస్తుండడం విశేషం.

ఇందులో 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 90W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంది. ఐపీ 68+ ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. ఎన్ఎఫ్‌సీ, టైప్‌సి పోర్ట్ వంటివి ఉన్నాయి. ఈ ఫోన్ బరువు 186 గ్రాములు. ఫోన్‌తో పాటే ఛార్జర్‌ను, కేస్‌ను ప్రొవైడ్ చేస్తున్నారు.

ఇక ధర విషయానికొస్తే.. ఇది రెండు వేరియంట్లలో వస్తోంది. 12జీబీ + 256జీబీ వేరియంట్ ధర రూ.54,999గా కంపెనీ నిర్ణయించింది. 16జీబీ + 512జీబీ వేరియంట్ ధర రూ.59,999గా కంపెనీ పేర్కొంది. యాంబర్ ఎల్లో, ఫ్రాస్ట్ బ్లూ, లక్స్ గ్రే రంగుల్లో లభిస్తుంది. వివో ఇండియా వెబ్‌సైట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో జులై 23 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయి. నేటి నుంచి ప్రీ బుకింగ్స్ ప్రారంభమవుతాయి. ఎంపిక చేసిన కార్డులపై రూ.6 వేలు డిస్కౌంట్ లేదా రూ.6 వేలు ఎక్స్ఛేంజీ బోనస్ కింద లభిస్తుంది.




## మస్క్ అన్ని కంపెనీల్లో
## ఒక్కటే ఏఐ

**ఎలాన్‌మస్క్‌కు చెందిన కంపెనీలన్నింటినీ ఒకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గొడుగు కిందకు తీసుకువచ్చే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతేడాది మస్క్ స్థాపించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ ఎక్స్ఏఐలో స్పేస్‌ఎక్స్ రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు రాయిటర్స్ తెలిపింది. స్పేస్‌ఎక్స్, టెస్లా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)తో సహా అతని అన్ని కంపెనీల్లో ఏఐని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నారు.**

ఈ ఏడాది ప్రారంభంలో ఎక్స్ఏఐ ఎక్స్‌లో విలీనమైన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇప్పుడు కంపెనీ విలువ 113 బిలియన్ డాలర్లుగా ఉందని రాయిటర్స్ నివేదిక తెలిపింది.

జూన్‌లో మోర్గాన్ స్టాన్లీ ఈ భారీ ఫండింగ్‌కు నేతృత్వం వహించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను తన వ్యాపారాల్లో కీలకంగా ఉపయోగించుకోవాలన్న మస్క్ ప్రణాళికపై బలమైన పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ఇది హైలైట్ చేస్తుంది.

ఈ ప్లాన్‌లో ఎక్స్ఏఐ రూపొందించిన చాట్‌బాట్ గ్రోక్ కీలకంగా మారింది. స్పేస్‌ఎక్స్ శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీస్ స్టార్‌లింక్‌లో కస్టమర్ ప్రశ్నలను నిర్వహించడానికి గ్రోక్‌ను ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. దీన్ని టెస్లా ఆప్టిమస్ రోబోట్లలోకి తీసుకురావడానికి టెస్టింగ్ నిర్వహిస్తున్నారు. మస్క్‌కు చెందిన అన్ని కంపెనీల ఎకోసిస్టమ్‌లో గ్రోక్‌ను ప్రధాన ఏఐ వ్యవస్థగా ఉండాలని కోరుకుంటున్నట్లు సమాచారం.

# పీఎం కిసాన్ నిధి
# విడుదలకు డేట్ ఫిక్స్?

**పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత నిధుల కోసం ఎంతో మంది రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు తదుపరి విడత పీఎం కిసాన్ నిధులను ఎకరాకు రూ.2,000 చొప్పున ఈ జులైలోనే విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. పీఎం కిసాన్ నిధులను ప్రతి నాలుగు నెలలకు ఒకసారి విడుదల చేస్తారు. చివరి 19వ విడతను 2025 ఫిబ్రవరిలో విడుదల చేశారు. గతేడాది జూన్ వాయిదాను నెల ముగియకముందే విడుదల చేశారు. అయితే ఈసారి నిధుల విడుదలలో జాప్యం జరుగుతుంది.**



త్వరలోనే జూన్ వాయిదాలను ఈ జులైలో విడుదల చేయబోతున్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. రైతులు తమ అర్హతను తెలుసుకోవాలని, ఈకేవైసీని అప్‌డేట్ చేయాలని సూచిస్తున్నారు. రైతుల చిరునామా కూడా వ్యాలిడేట్ అయ్యేలా చూసుకోవాలని చెప్పారు. కొందరి చిరునామా, లొకేషన్ రికార్డుల్లో తప్పుల కారణంగా అనర్హులుగా మిగిలిపోతున్నట్లు తెలిపారు. కాబట్టి చిరునామాను అప్‌డేట్ చేయాలని చెప్పారు.

**పీఎం కిసాన్ స్కీమ్**

2019లో అప్పటి ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ మధ్యంతర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించారు. తర్వాత పీఎం కిసాన్ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద డీబీటీ పథకంగా నిలిచింది. దీని కింద అర్హులైన రైతులకు ప్రతి నాలుగు నెలలకు రూ.2,000 చొప్పున ఏప్రిల్‌జులై, ఆగస్టునవంబర్, డిసెంబర్‌మార్చి నెలల్లో ఏటా రూ.6,000 చొప్పున అందిస్తారు.

**పీఎం కిసాన్ భూమి చిరునామా అప్‌డేట్ చేయడం ఎలా?**

1. పీఎం కిసాన్ వెబ్సైట్.. https://pmkisan.gov.inలోకి వెళ్లాలి.
2. హోమ్ పేజీలోని ఫార్మర్స్ కార్నర్ కింద 'స్టేట్ ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్'పై క్లిక్ చేయాలి.
3. 'రిజిస్ట్రేషన్ నంబర్' లేదా 'ఆధార్ నంబర్' ఎంటర్ చేయాలి.
4. కింద క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి.
5. గెట్ ఓటీపీపై క్లిక్ చేయాలి.
6. మొబైల్‌కు వచ్చిన ఓటీపీ అందులో ఫిల్ చేయాలి.
7. మీ పేరు మీద సాగు భూమి రుజువు పత్రాలను అప్‌లోడ్ చేయాలి. (పట్టా పుస్తకాలు, భూ రికార్డులు..మొదలైనవి)
8. మీరు చేసిన మార్పులను సమీక్షించి ఆన్‌లైన్‌లో ఫామ్ సబ్మిట్ చేయాలి.



**ఈ-కేవైసీ ఎలా పూర్తి చేయాలి?**

**ఈ పథకం అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పీఎం కిసాన్ రిజిస్టర్డ్ రైతులకు ఈకేవైసీ తప్పనిసరి. ఓటీపీ ఆధారిత ఈ-కేవైసీ, బయోమెట్రిక్ ఈ-కేవైసీ, ఫేషియల్ అథెంటికేషన్ అనే మూడు సులువైన మార్గాల్లో ఈ-కేవైసీని పూర్తి చేయవచ్చు.**

పీఎంకిసాన్ ఇన్‌స్టాల్‌మెంట్ స్టేటస్‌ను ఎలా తనిఖీ చేయాలి?

https://pmkisan.gov.in అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలి.


'నో యువర్ స్టేటస్'పై క్లిక్ చేయాలి.

మీ రిజిస్ట్రేషన్ నెంబరు లేదా ఆధార్ నెంబరు ఎంటర్ చేయాలి.

లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉందో లేదో చెక్ చేసుకోవాలి.

# మరో 2,400 మంది
# ఉద్యోగాలు కట్!

**గత వారమే ఒరెగాన్‌లో 500 మందికి పైగా ఉద్యోగులను తొలగించిన చిప్ మేకర్ ఇంటెల్ మళ్లీ భారీగా ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమవుతోంది. ది ఒరెగాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటెల్ ఒరెగాన్ స్టేట్‌లో దాదాపు 2,400 ఉద్యోగాలను తొలగించాలని యోచిస్తోంది. దీంతో ఈ నెలలో మొత్తం తొలగింపుల సంఖ్య 2,892కు చేరుకుంటుంది. యునైటెడ్ స్టేట్స్ అంతటా రాబోయే రోజుల్లో దాదాపు 4,000 మంది ఇంటెల్ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోతారని భావిస్తున్నారు. కొత్త సీఈఓ లిప్-బు టాన్ నేతృత్వంలో కంపెనీ వ్యయ తగ్గింపు చర్యల్లో భాగంగా ఈ తొలగింపులు జరుగుతున్నాయి.**




ఇంటెల్ కార్యకలాపాలను సరళతరం చేయాలని, వ్యయాన్ని తగ్గించాలని యోచిస్తోంది. ఒకప్పుడు సెమీకండక్టర్ పరిశ్రమలో ఆధిపత్యం చెలాయించి ఇటీవల ప్రత్యర్థుల కంటే వెనుకబడిపోవడంతో సీఈఓపై ఒత్తిడి ఎక్కువైందని కొందరు అభిప్రాయపడుతున్నారు. దాంతో లేఆఫ్స్‌పై దృష్టి సారిస్తున్నారని చెబుతున్నారు. ఒరెగాన్ రాష్ట్రంలో ఇంటెల్ కార్యాలయంలో సుమారు 20,000 మంది కార్మికులు పని చేస్తున్నారు. తాజా తొలగింపులు స్థానిక ఉద్యోగుల్లో 12 శాతం మందిపై ప్రభావం చూపనున్నాయి.

ప్రభావిత ఉద్యోగుల్లో చిప్ ప్రొడక్ట్ డిజైనర్లు, క్లౌడ్ సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఫిజికల్ డిజైన్ ఇంజినీర్లు ఉన్నారు. కొందరు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను కూడా ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఉద్యోగాల కోతతో చిప్ తయారీలో కీలకంగా వ్యవహరించే ఇంటెల్ అంతర్గత ఫౌండ్రీ విభాగం తీవ్రంగా దెబ్బతింటుందని భావిస్తున్నారు. ఇటీవల ఇంటెల్ కాలిఫోర్నియా, అరిజోనా, టెక్సాస్‌లోని ఉద్యోగులకు లేఆఫ్ నోటీసులు జారీ చేసింది. సాఫ్ట్‌వేర్ నిర్వచించిన ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించిన కంపెనీ ఇటీవల జర్మనీలోని మ్యూనిచ్‌లోని తన ఆటోమోటివ్ చిప్ యూనిట్‌ను మూసివేసింది. ఆ డివిజన్‌లో చాలా మంది ఉద్యోగులను కూడా తొలగించే అవకాశం ఉంది. ఉద్యోగ కోతలకు ముందస్తు పదవీ విరమణ ప్యాకేజీలు (ఎల్‌ఆర్‌ఎస్) అందించడం లేదు. దీనికి బదులుగా ఇంటెల్ తొమ్మిది వారాల వేతనం, ఇతర ప్రయోజనాలతో పాటు 60 రోజులు లేదా నాలుగు వారాల నోటీసును అందిస్తోంది.



## ఐదేళ్ల ముందే 50 శాతం టార్గెట్ పూర్తి

పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ కీలక మైలురాయిని చేరుకుంది. శిలాజేతర ఇంధన శక్తి సామర్థ్యాన్ని నిర్దేశించిన ఐదేళ్ల ముందే 50% లక్ష్యాన్ని సాధించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తన ఎక్స్ ఖాతాలో వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో స్థాపిత విద్యుత్ సామర్థ్యం 484.8 గిగావాట్లు. ఇందులో 242.8 గిగావాట్లు గ్రీన్ వనరుల నుంచే వస్తుందన్నారు. దాంతో స్థాపిత సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుదుత్పత్తి నమోదవుతోంది.

దేశంలో 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన ఆధారిత విద్యుదుత్పత్తిని పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. 'ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గ్రీన్ ఎకోసిస్టమ్‌ను గణనీయంగా పెంచాలని నిర్ణయించుకున్నాం. దేశం మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఇప్పుడు 484.8 గిగావాట్లుగా ఉంది. అందులో శిలాజేతర ఇంధన వనరుల నుంచి 242.8 గిగావాట్లు సమకూరుతుంది' అని జోషి ఎక్స్‌లో తెలిపారు. 2030 నాటికి భారత్ శిలాజేతర ఇంధన లక్ష్యంలో 50 శాతం ఐదేళ్లు ముందే సాధించింది.

# మిగిలిన ఉద్యోగులు
# ఏఐపై దృష్టిపెట్టండి: మైక్రోసాఫ్ట్

**భారీ లేఆఫ్‌ల అనంతరం మిగిలిన ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ బలమైన సందేశం పంపింది. ఏఐలో నైపుణ్యాలను పెంచుకోవడంపై వారు దృష్టిపెట్టాలని సూచించింది. వివిధ డివిజన్లలో 15,000 మంది ఉద్యోగులను సంస్థ విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. 2025లో ఇప్పటివరకు ఈ సంస్థ మొత్తం నాలుగు విడతల్లో ఉద్యోగులను తొలగించింది. తాజా విడతలో మాత్రం 9,000 మందిపై వేటు వేసింది. ముఖ్యంగా ఎక్స్‌బాక్స్‌పై ఈ ప్రభావం ఎక్కువగా పడింది.**




మైక్రోసాఫ్ట్ డెవలపర్ విభాగం ప్రెసిడెంట్ జూలియా లూయిసన్ ఇటీవల తమ మేనేజర్లకు కీలక సూచనలు చేశారు. ఒక ఉద్యోగి పనితీరు అంచనా వేసే సమయంలో వారు కృత్రిమ మేధ వినియోగించడం, దాని ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అంతేకాదు ఉద్యోగులకు పంపిన అంతర్గత ఈమెయిల్స్‌లో "కృత్రిమ మేధ వినియోగం ఏమాత్రం ఆప్షన్ కాదని.. ప్రతి స్థాయిలో.. ప్రతి ఉద్యోగికి అత్యంత ముఖ్యమైంది" అని జూలియా వెల్లడించారు. దీంతోపాటు కంపెనీ ఉద్యోగుల పనితీరు కొలమానానికి కూడా ఏఐ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొనే అంశాన్ని పరిశీలిస్తోంది. వచ్చే ఏడాది నాటికి దీనికి సంబంధించిన ప్రమాణాలను నిర్దేశించే అవకాశం ఉంది.

ఈసారి ఉద్యోగాల కోతల్లో కంపెనీ ప్రధానంగా సేల్స్ విభాగానికి సంబంధించిన సభ్యులను లక్ష్యంగా చేసుకొంది. వీరి స్థానంలో ఏఐ టూల్స్‌ను కస్టమర్లకు మరింత మెరుగ్గా వివరించగల టెక్నికల్ సొల్యూషన్ ఇంజినీర్లను నియమించుకోవాలని భావిస్తోంది. ఈమేరకు సంస్థ సేల్స్ విభాగం చీఫ్ జడ్సన్ అల్తోఫ్ ఓ ప్రణాళికను సిద్ధం చేశారు.



## 'హరి హర వీరమల్లు'..

### ప్రీ రిలీజ్ ఈవెంట్, రన్‌టైమ్ వివరాలివీ..

మరికొన్ని రోజుల్లో 'హరి హర వీరమల్లు' గా పవన్ కల్యాణ్ తెరపై కనిపించనున్నారు. ఆయన హీరోగా నటించిన ఈ సినిమా ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసిన ఈ సినిమా రన్‌టైమ్: 2:42 నిమిషాలు . మరోవైపు, ఇప్పటికే ప్రమోషన్స్ షురూ చేసిన చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. విశాఖపట్నంలో ఈ నెల 20న ఈ వేడుక నిర్వహించనున్నారు.

రిషబ్ శెట్టి.. ఓ ప్రీక్వెల్.. ఓ సీక్వెల్.. ఓ హిస్టారికల్ ఇంకా..
మరో రెండు సర్‌ప్రైజ్‌లు..
అభిమానుల కోసం మరో రెండు సర్‌ప్రైజ్‌లు ఇవ్వనున్నట్టు టీమ్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మూవీ మేకింగ్ వీడియో, ఓ పవర్‌ఫుల్ సాంగ్‌ను త్వరలో విడుదల చేయనున్నట్టు తెలిపింది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్, 'తార తార', 'ఎవరది ఎవరది' తదితర పాటలు ప్రేక్షకులను అలరించాయి.

## కొత్త హీరోతో సినిమా.. శ్రీలీల పారితోషికం ఎంత?

ఈ మధ్య కాలంలో సరైన హిట్స్ పడలేదు గానీ శ్రీలీల ప్రస్తుతం ట్రెండింగ్ హీరోయినే. ఈ ఏడాది మార్చిలో 'రాబిన్ హుడ్'తో వచ్చింది గానీ కలిసి రాలేదు. ఇప్పుడు కొత్త హీరో కిరీటితో కలిసి 'జూనియర్' అనే మూవీ చేసింది. రీసెంట్‌గా 'వైరల్ వయ్యారి' అనే పాట తెగ వైరల్ అవుతోంది కదా! అది ఈ సినిమాలోనిదే. ఓవైపు స్టార్ హీరోలతో కలిసి పనిచేస్తున్న ఈ బ్యూటీ.. కొత్త కుర్రాడితో చేసేందుకు రెమ్యునరేషన్ గట్టిగానే తీసుకుందనే వార్తలు వినిపిస్తున్నాయి.తెలుగు మూలాలు ఉన్నప్పటికీ శ్రీలీల.. బెంగళూరులోనే పెరిగింది. హీరోయిన్‌గా తొలి మూవీ కూడా కన్నడలోనే చేసింది. ఇప్పుడు చాన్నాళ్ల తర్వాత 'జూనియర్' మూవీతో రాబోతుంది. గాలి జనార్ధన కొడుకు కిరీటి హీరోగా పరిచయమవుతున్న చిత్రమిది. కన్నడతో పాటు తెలుగులోనూ జూలై 18న రిలీజ్ చేస్తున్నారు. కాస్తోకూస్తో హైప్ నడుస్తోంది.అయితే స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్న శ్రీలీల.. సాధారణంగా రూ.2 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. అయితే జూనియర్ కోసం మాత్రం ఈమెకు రూ.4 కోట్ల పారితోషికం ఇచ్చారనే టాక్ నడుస్తోంది. అంటే డబుల్ బొనాంజా. ఈ మూవీలో శ్రీలీల మాత్రం కాస్త చెప్పుకోదగ్గ ఫేస్. కిరీటి కొత్తవాడు. జెనీలియా చాన్నాళ్ల తర్వాత ఈ సినిమాతోనే దక్షిణాదిలోకి రీఎంట్రీ ఇస్తోంది. మరి ఈ మూవీ ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి?'జూనియర్' సినిమా కోసం టాప్ టెక్నీషియన్స్ పనిచేశారు.





## కరీనా సైజ్ జీరో రహస్యం..

### అసలు విషయం చెప్పిన డైటీషియన్

**సినీతారలు ఎంత నాజూగ్గా ఉంటే, అన్ని రోజులు ఇండస్ట్రీలో మనగలుగుతారు. అవకాశాలు తలుపు తట్టాలంటే నోరు కట్టుకోవాల్సిందే. ఈ విషయంలో బాలీవుడ్ తారలు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. 'సైజ్ జీరో' ట్యాగ్‌కు పర్‌ఫెక్ట్ నిర్వచనం కరీనా కపూర్ . 2008లో వచ్చిన 'తషాన్' నుంచి ఆమెకు డైటీషియన్‌గా వ్యవహరిస్తున్న రుజుత దివికర్ ఆ సీక్రెట్‌ను తాజాగా బయటపడ్డారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చినా, వయసు 40 దాటినా కరీనా ఇప్పటికీ నాజూగ్గా ఉండటం వెనుక రహస్యాన్ని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. గత 18ఏళ్లగా కరీనా ఒకే రకమైన ఆహార నియమాలు పాటిస్తున్నట్లు తెలిపారు.**

''కరీనా తన రోజును డ్రైఫ్రూట్స్‌తో ప్రారంభిస్తారు. రాత్రంతా నానబెట్టిన బాదం, కిస్‌మిస్, అంజీరా తీసుకుంటారు. వ్యాయామం తర్వాత ఫ్రెష్ అయి, అల్పాహారంగా పరాటా లేదా పోహా ఎక్కువగా తింటారు. భోజన విరామం వరకూ మంచి నీళ్లు తాగుతారు. మధ్యాహ్నం లంచ్‌లో అన్నం, పప్పు ఉండాల్సిందే. ఇక సాయంత్రం కొన్నిసార్లు చీజ్ టోస్ట్ తీసుకుంటారు. దీనితో పాటు, కాలాన్ని బట్టి లభించే తాజా పండ్లు తింటారు. వేసవిలో ఎక్కువగా మామిడి పండ్లు నేరుగా లేదా మిల్క్ షేక్ రూపంలో తీసుకుంటారు. ఇక రాత్రి భోజనం నెయ్యితో చేసిన కిచిడీ లేదా పులావ్‌తో ముగిస్తారు. షూటింగ్‌లో సమయంలో ఈ మెనూలో కొన్ని మార్పులు ఉంటాయి. అక్కడ లభించే అన్నం, పప్పుతో సరిపెట్టుకుంటారు. షూటింగ్ లేని రోజుల్లో ఇంట్లో చేసే రోటీ, కూర ఉండాల్సిందే. కరీనా వారంలో ఐదు రోజులు నెయ్యితో చేసిన కిచిడీ తినేందుకు ఆసక్తి చూపుతారు'' అని దివికర్ పంచుకున్నారు.

కరీనా కపూర్ కూడా తన డైట్ గురించి ఈ సందర్భంగా మాట్లాడారు. ''1015 రోజులు అదే పప్పుఅన్నం, పెరుగన్నం చేసి నా వంట మనిషి విసిగిపోతాడు. 'మేడమ్.. ఇక నేను ఏ వంట చేయాలి' అంటాడు. కానీ, నాకు మాత్రం రోజూ తిన్నా కూడా ఏమీ అనిపించదు. సాయంత్రం 6 గంటలకు డిన్నర్ అయిపోతుంది. రాత్రి 9.30 గంటలకు నిద్ర పోవాల్సిందే. ప్రపంచం నిద్రలేవక ముందే నా వర్కవుట్స్ పూర్తవుతాయి. నా స్నేహితులు కూడా నన్ను రాత్రి పార్టీలకు పిలవడం మానేశారు. నా శరీరాకృతి చూసి, నేను ఎక్కువగా క్వినోవా తీసుకుంటానన్న ప్రచారం ఉంది. అందులో నిజం లేదు'' అని కరీనా చెప్పుకొచ్చింది.

## వారి బాధలు చాలా దగ్గరగా చూశా: మంచు మనోజ్



కోలీవుడ్ సినిమా షూటింగ్‌లో స్టంట్ మ్యాన్ రాజు మృతిపై టాలీవుడ్ హీరో మంచు మనోజ్ విచారం వ్యక్తం చేశారు. అలాంటి వారి బాధలను తాను చాలా దగ్గరగా చూశానని మనోజ్ తన బాధను వ్యక్తం చేశారు. వెట్టువం మూవీ సెట్‌లో స్టంట్ లెజెండ్ ఎస్.ఎం.రాజు (మోహన్‌రాజ్) మరణించిన విషయం నాకు ఇప్పుడే తెలిసిందని ట్వీట్ చేశారు. స్టంట్‌మ్యాన్ కుటుంబానికి మద్దతుగా ఉంటానని.. ఇలాంటి విషాద సమయంలో మన పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరుతున్నానంటూ పోస్ట్ చేశారు. మంచు మనోజ్ తన ట్వీట్‌లో రాస్తూ..'మూవీ సెట్‌లో స్టంట్ లెజెండ్ ఎస్.ఎం.రాజు (మోహన్‌రాజ్) విషాదకరంగా మరణించిన విషయం నాకు ఇప్పుడే తెలిసింది. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. గాయాలు జరిగినప్పుడు, ప్రాణాలు పోయినప్పుడు స్టంట్ పెర్ఫార్మర్లు, వారిని ప్రేమించేవారు ఎలాంటి బాధను అనుభవిస్తారో నేను దగ్గరగా చూశా. ఒక స్టంట్‌మ్యాన్‌గా వారి కుటుంబానికి మద్దతుగా మన పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ నిలబడాలని కోరుతున్నా.

## లార్డ్స్‌లో లవ్ బర్డ్స్.. బాయ్‌ఫ్రెండ్‌తో ఆదిపురుష్ భామ సందడి!

ఆదిపురుష్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాలీవుడ్ ముద్దుగుమ్మ కృతి సనన్. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మెప్పించింది. ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న భామ ప్రస్తుతం లండన్‌లో వాలిపోయింది. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న టీమిండియా మ్యాచ్‌లో తళుక్కున మెరిసింది. అయితే ఆమెతో పాటు బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తోన్న కబీర్ బహియా కూడా కనిపించారు. ఇద్దరు జంటగా కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో మరోసారి ఈ ముద్దుగుమ్మపై డేటింగ్ రూమర్స్ వినిపిస్తున్నాయి.

**కృతి-కబీర్ డేటింగ్ రూమర్స్**

అయితే ఈ జంట ఇలా కనిపించడం ఇదేం మొదటిసారి కాదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన స్నేహితుడి వివాహానికి హాజరయ్యారు. అప్పట్లో వీరిద్దరు కలిసి వచ్చిన ఓ వీడియో నెట్టంట వైరలైంది. ఈ పెళ్లిలో కృతి సనన్-కబీర్ చాలా సన్నిహితంగా కనిపించారు. లండన్‌కు చెందిన వ్యాపారవేత్త అయినా కబీర్‌తో కలిసి చాలాసార్లు విహారయాత్రల్లోనూ కృతి కనిపించింది. అయితే వీరిద్దరికీ దాదాపు ఎనిమిదేళ్ల ఏజ్ గ్యాప్ ఉంది. ఈ జంట ప్రస్తుతం ప్రేమలో ఉన్నారని.. ఈ ఏడాదిలోనే వివాహం చేసుకోవాలని కూడా ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే మ్యాచ్‌లో పలువురు బాలీవుడ్ తారలు కూడా హాజరై సందడి చేశారు. హీరో అక్షయ్ కుమార్, ట్వింకిల్ ఖన్నా సైతం లార్డ్స్ టెస్ట్ మ్యాచ్‌కు హాజరయ్యారు. భారత క్రికెట్ జట్టు మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రితో కలిసి మ్యాచ్‌ను వీక్షించారు.





## లార్డ్స్‌లో సరికొత్త చరిత్ర.. 21 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి

**లార్డ్స్ వేదికగా భారత్-ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న మూడో టెస్టు ఓ అరుదైన రికార్డుకు వేదికైంది. ఈ మ్యాచ్‌లో మొత్తం బౌల్డ్ రూపంలో ఇరు జట్లు బౌలర్లు మొత్తం 14 వికెట్లను పడగొట్టారు. 21వ శతాబ్దంలో ఓ టెస్టు మ్యాచ్‌లో అత్యధిక బ్యాటర్లు బౌల్డ్ కావడం ఇదే తొలిసారి. భారత బౌలర్లు 12 బౌల్డ్‌లు చేయగా.. ఇంగ్లండ్ బౌలర్లు రెండు బౌల్డ్‌లు చేశారు.**

ఇంతకుముందు ఈ రికార్డు వెస్టిండీస్‌సౌతాఫ్రికా జట్లు పేరిట ఉండేది. 2005లో స్పోర్ట్స్ ఆఫ్ స్పెయిన్ వేదికగా జరిగిన టెస్టు మ్యాచ్‌లో సౌతాఫ్రికా, విండీస్ బౌలర్లు కలిపి 13 బౌల్డ్‌లు చేశాడు. తాజా మ్యాచ్‌తో ఈ ఆల్‌టైమ్ రికార్డును ఇంగ్లండ్‌భారత్ బ్రేక్ చేశాయి. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. భారత జట్టు పోరాడుతోంది. టీమిండియా విజయానికి ఇంకా 56 పరుగులు కావాలి. రవీంద్ర జడేజా(38), జస్ప్రీత్ బుమ్రా(4) ఉన్నారు.

**2000 నుంచి ఒక టెస్ట్‌లో అత్యధిక బ్యాటర్లు బౌల్డ్ అయిన మ్యాచ్‌లు ఇవే..**

- 14 ఇంగ్లాండ్ వర్సెస్ భారత్, లార్డ్స్, 2025
- 13 వెస్టిండీస్ వర్సెస్ దక్షిణాఫ్రికా, పోర్ట్ ఆఫ్ స్పెయిన్, 2005
- 13 పాకిస్తాన్ వర్సెస్ ఇంగ్లాండ్, అబుదాబి, 2012
- 13 ఇండియా వర్సెస్ దక్షిణాఫ్రికా, నాగ్‌పూర్, 2015
- 13 ఇండియా వర్సెస్ దక్షిణాఫ్రికా, ఢిల్లీ, 2015











## నాలుగో రౌండ్‌లో హంపి, దివ్య

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ నాకౌట్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి, జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ (మహారాష్ట్ర) నాలుగో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్‌లో హంపి 1.5-0.5తో కులోన్ క్లాడియా (పోలాండ్)పై, దివ్య 1.5-0.5తో టియోడోరా ఇంజాక్ (సెర్బియా)పై విజయం సాధించారు. ఆదివారం జరిగిన మూడో రౌండ్ రెండో గేమ్‌లో హంపి 44 ఎత్తుల్లో క్లాడియాను ఓడించింది. ఇంజాక్‌తో జరిగిన రెండో గేమ్‌ను దివ్య 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. శనివారం జరిగిన మూడో రౌండ్ తొలి గేమ్‌ను హంపి 102 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... ఇంజాక్‌తో జరిగిన గేమ్‌లో దివ్య 39 ఎత్తుల్లో గెలిచింది. మూడో రౌండ్‌లోని రెండు గేమ్‌లు ముగిశాక భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక-స్టావ్‌రూలా (గ్రీస్), వంతిక అగర్వాల్-కాటరీనా లాగ్నో (రష్యా), వైశాలి-కరిస్సా యిప్ (అమెరికా) 1-1తో సమంగా నిలిచారు. దాంతో ఈరోజు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతలను నిర్ణయిస్తారు.

## సైనా అలా.. పారుపల్లి కశ్యప్ ఇలా!..

# ఇన్‌స్టా పోస్ట్ వైరల్

**భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్స్ పతక విజేత సైనా నెహ్వాల్ తన భర్త పారుపల్లి కశ్యప్ తో విడిపోతున్నట్లు ప్రకటించింది. తాము సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆదివారం రాత్రి సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.**

**ప్రకటన విడుదల చేసిన సైనా**

ఈ మేరకు.. ''జీవితం మనల్ని ఒక్కోసారి వేర్వేరు దిశల్లో ప్రయాణం చేయిస్తుంది. సుదీర్ఘ చర్చలు, ఆలోచనల తర్వాత.. నేను కశ్యప్ పారుపల్లి విడిపోవాలని నిర్ణయించుకున్నాం.

శాంతియుత జీవనం, ఎదుగుదల, మానసిక ప్రశాంతత మా ఇరువురికీ ముఖ్యమని భావించి వేర్వేరు దారుల్లో ప్రయాణించాలని భావించాము. మా ఇద్దరి బంధానికి సంబంధించి నాకెన్నో మధురానుభూతులు ఉన్నాయి. ఇక ముందు కూడా స్నేహితుల్లా ముందుకు సాగుతాం.

ఇలాంటి క్లిష్ట సమయంలో మా గోప్యత, గౌరవానికి భంగం కలగకుండా మా నిర్ణయాన్ని గౌరవించాలని కోరుకుంటున్నా'' అని సైనా నెహ్వాల్ ఇన్‌స్టా స్టోరీ ద్వారా తమ విడాకుల విషయాన్ని వెల్లడించింది.

**కపుల్ గోల్స్ సెట్ చేసిన క్రీడా జంట.. అంతలోనే..**

అయితే, సైనాతో ఉన్న పాత ఫొటోలన్నీ కూడా పారుపల్లి కశ్యప్ అలాగే ఉంచాడు. ఆమెతో కలిసి టూర్లకు వెళ్లిన ఫొటోలన్నీ తన సోషల్ మీడియా అకౌంట్లో



**కెరీర్‌లో బెస్ట్**

కాగా సైనా లండన్ ఒలింపిక్స్ 2012లో మహిళల సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం గెలవగా.. అదే ఎడిషన్‌లో కశ్యప్ మెన్స్ సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన భారత తొలి బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా కశ్యప్ చరిత్ర సృష్టించాడు.

అలాగే అట్టిపెట్టుకున్నాడు. కాగా భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ దగ్గర శిక్షణ తీసుకున్న సైనా, కశ్యప్ చాలా ఏళ్లపాటు ప్రేమించుకున్నారు. 2018లో పెళ్లి బంధంతో ఒక్కటైన వీరు అన్యోన్యంగా ఉండేవారు. కెరీర్ పరంగానూ ఒకరికొరు అండగా ఉంటూ కపుల్ గోల్స్ సెట్ చేసే వాళ్లు.

**బెస్టెస్ట్ అంటూ కశ్యప్ స్టోరీ**

**అయితే, అదే సమయంలో పారుపల్లి కశ్యప్ మాత్రం విడాకుల గురించి ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. అంతేకాదు.. సైనా కంటే ముందే ఓ పోస్ట్‌ను ఇన్‌స్టాలో షేర్ చేశాడు. ఇందులో కశ్యప్ తన స్నేహితులతో కలిసి వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్న ఫొటోను రీషేర్ చేస్తూ.. "బెస్టెస్ట్" అంటూ స్టోరీ పెట్టాడు.**

కానీ అకస్మాత్తుగా ఇలా సైనా నుంచి విడాకుల ప్రకటన రాగా.. కశ్యప్ మాత్రం ఇంకా స్పందించకపోవడం గమనార్హం. కాగా సైనాకు ప్రయాణాలు చేయడం అంటే చాలా ఇష్టం. కొన్నిసార్లు భర్త కశ్యప్‌తో పాటు టూర్లకు వెళ్లే సైనా.. మరికొన్ని సార్లు తన తల్లిదండ్రులతో కలిసి ప్రయాణాలు చేసేది. ఇందుకు సంబంధించిన జ్ఞాపకాలను ఫొటోల రూపంలో తన సోషల్ మీడియాలో షేర్ చేసేది సైనా.

ఇక భర్తతో ఉన్న మధురానుభూతులను కూడా కెమెరాతో ఒడిసిపట్టి అభిమానులతో పంచుకునేది. చివరగా ఈ ఏడాది మేలో సైనా, కశ్యప్ సౌతాఫ్రికా టూర్‌కి వెళ్లినట్లుగా తెలుస్తోంది. అక్కడ సంతోషంగా గడిపిన క్షణాలను సైనా షేర్ చేసింది. అయితే, వీరి మధ్య విభేదాలు, విడాకులకు గల కారణం ఏమిటో మాత్రం తెలియదు.

# ఓడినా గర్వంగా ఉంది..

## అదే మా కొంపముంచింది: టీమిండియా కెప్టెన్

**లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో 22 పరుగుల తేడాతో టీమిండియా పరాజయం పాలైంది. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆఖరి వరకు పోరాడి ఓటమి పాలైంది. లక్ష్య చేధనలో 170 పరుగులకు టీమిండియా ఆలౌటైంది. స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(181 బంతుల్లో 61) వీరోచిత పోరాటం చేశాడు.**

టాపర్డర్ విఫలం కావడంతో భారత్ లక్ష్యాన్ని చేధించలేకపోయింది. శుబ్‌మన్ గిల్(6), యశస్వి జైశ్వాల్(0), కరుణ్ నాయర్(14) తీవ్ర నిరాశపరిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, కెప్టెన్ బెన్ స్టోక్స్ తలా మూడు వికెట్లు పడగొట్టి గిల్ సేన పతనాన్ని శాసించారు.

వీరిద్దరితో పాటు కార్స్ రెండు, బషీర్, వోక్స్ తలా వికెట్ సాధించారు. ఈ హార్ట్‌బ్రేకింగ్ ఓటమిపై మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ స్పందించాడు. ఆఖరి వరకు పోరాడిన తమ ఆటగాళ్లను గిల్ అభినందించాడు.

"ఈ మ్యాచ్‌లో ఓడినా.. చాలా గర్వంగా ఉంది. మేము గెలుపు కోసం చివరి సెషన్, చివరి వికెట్ వరకు ప్రయత్నించాము. కానీ దురదృష్టవశాత్తూ మేము లక్ష్యాన్ని చేరుకోలేకపోయాము. అయితే చేతిలో చాలా వికెట్ల ఉండడంతో టార్గెట్‌ను ఈజీగా చేజ్ చేస్తామని భావించాను. కానీ ఇంగ్లండ్ బౌలర్లు మాత్రం మాపై పైచేయి సాధిస్తూ వచ్చారు.

దీంతో టాపర్డర్‌లో 50 పరుగుల భాగస్వామ్యాలు ఒకట్రెండు వచ్చి ఉంటే బాగుండేది అనుకున్నాము. కానీ మేము అలా చేయలేకపోవడంతోనే ఓటమి చవిచూశాము. వారు మా కంటే బాగా ఆడారు. అయితే జడేజా క్రీజులో ఉండడంతో మేము గెలుస్తామన్న నమ్మకం నాకు ఉండేది. అతడి చాలా అనుభవం ఉంది.

అందుకే అతడికి డ్రెస్సింగ్ రూమ్ నుంచి ఎటువంటి సందేశం ఇవ్వలేదు. టెయిలాండర్లతో కలిసి అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. మా టెయిలాండర్లు (బుమ్రా, సిరాజ్) సైతం అతడికి సహకరించారు. కానీ ఆఖరికి మ్యాచ్‌ను ఫినిష్ చేయలేకపోయాము.



తొలి ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ ఆటను మలుపు తిప్పింది.

ఒకానొక సమయంలో మొదటి ఇన్నింగ్స్‌లో మాకు 50 నుంచి 60 పరుగుల ఆధిక్యం లభిస్తుందని మేము అనుకున్నాము. కానీ పంత్ ఔట్ కావడంతో అంతా తారుమారైంది. ఈ పిచ్‌లో 150200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం అంత సులభం కాదని మాకు తెలుసు. అందుకే మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం పొందాలని భావించాము.

కానీ మేము అనుకున్నది జరగలేదు. పరిస్థితులు చాలా త్వరగా మారిపోయాయి. నాలుగో రోజు ఆటలో చివరి సెషన్‌లో మేము కొంచెం మెరుగ్గా ఆడి వికెట్లు కోల్పోకపోయింటే పరిస్థితి మరోవిధంగా ఉండేది. చివరి రోజు ఆటలో ఇంగ్లండ్ సరైన ప్రణాళికలతో బరిలోకి దిగింది.

చివరి రోజు మాకు ఒక 50 పరుగుల భాగస్వామ్యం వచ్చి ఉన్నా గెలిచే వాళ్లం. మిగిలిన మ్యాచ్‌లలో మా తప్పిదాలను సరిదిద్దుకుంటాము. నాలుగో టెస్టుకు బుమ్రా అందుబాటుపై త్వరలోనే అప్‌డేట్ ఇస్తామని" గిల్ పోస్ట్ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నాడు.

# జడేజా పోరాటం వృథా.. ఉత్కంఠ పోరులో భారత్ ఓటమి

**లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్-భారత్ మధ్య జరిగిన మూడో టెస్టు మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఆఖరివరకు నువ్వానేనా అన్నట్లు సాగిన మ్యాచ్‌లో 22 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి పాలైంది. 193 పరుగుల లక్ష్యాన్ని చేధించలేక భారత జట్టు చతికల పడింది.**

ఈ స్వల్ప లక్ష్య చేధనలో 170 పరుగులకే టీమిండియా ఆలౌటైంది. రవీంద్ర జడేజా (181 బంతుల్లో 61 నాటౌట్) ఒంటరిపోరాటం చేసినప్పటికి జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు.

**ఆరంభం నుంచే..**

జడేజాతో పాటు కేఎల్ రాహుల్(54) పర్వాలేదనిపించగా మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. 58/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఐదో రోజు ఆట మొదలుపెట్టిన భారత్.. ఆరంభం నుంచే తడబడింది. రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ వరుస క్రమంలో పెవిలియన్‌కు చేరారు.



ఆ తర్వాత రవీంద్ర జడేజా, నితీశ్ కాసేపు నిలకడగా ఆడి భారత గెలుపుపై ఆశలు రెకెత్తించారు. అయితే లంచ్ బ్రేక్‌కు ముందు నితీశ్ ఔట్ కావడంతో మ్యాచ్ మళ్లీ ఇంగ్లండ్ వైపు టర్న్ అయింది. ఆ తర్వాత జడేజా.. జస్ప్రీత్ బమ్రాతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. బుమ్రా ఇంగ్లండ్ పేసర్లను ఎదుర్కొంటూ జడేజాకు మద్దతుగా నిలిచాడు. అయితే 50 బంతులకు పైగా బ్యాటింగ్ చేసిన బుమ్రా(5) భారీ షాట్‌కు ప్రయత్నించి తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన మహ్మద్ సిరాజ్ సైతం తన వంతు సహకారం అందించాడు.



కానీ ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సిరాజ్ బౌల్డ్ కావడంతో టీమిండియా అభిమానుల హార్ట్ బ్రేక్ అయింది. సిరాజ్ సైతం భావోద్వేగానికి లోనయ్యాడు. ఇంగ్లండ్ మాత్రం గెలుపు సంబరాల్లో మునిగి తేలిపోయింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, కెప్టెన్ బెన్ స్టోక్స్ తలా మూడు వికెట్లు పడగొట్టి గిల్ సేన పతనాన్ని శాసించారు.

వీరిద్దరితో పాటు కార్స్ రెండు, బషీర్, వోక్స్ తలా వికెట్ సాధించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 387 పరుగులు చేయగా.. టీమిండియా సైతం సరిగ్గా 387 పరుగులకే చేయగల్గింది. అనంతరం ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 192 పరుగులకు ఆలౌటైంది. సెకెండ్ ఇన్నింగ్స్‌లో బౌలర్లు అద్భుతంగా రాణించినప్పటికి.. బ్యాటర్లు విఫలం కావడంతో భారత్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది.